ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

వికారాబాద్ - మేడ్చల్
జిల్లాల వార్తలు
5
బుధవారం 8 జనవరి 2025


అమృత్ స్కీం పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ డీకే అరుణ, పక్కన తిరుపతిరెడ్డి

నిధులు కేంద్రానివి.. ప్రచారం రాష్ట్రానిదా?

- పాలమూరు ఎంపీ డీకే అరుణ
- కొడంగల్‌కు అమృత్ స్కీం కింద రూ.17 కోట్లు

కొడంగల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో ఇళ్ల నిర్మాణం చేపట్టి ఇందిరమ్మ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ప్రచారం చేసుకోవడం సరైంది కాదని పాలమూరు ఎంపీ డీకే అరుణ అన్నారు. మంగళవారం వికారాబాద్ జిల్లా కొడంగల్ పట్టణంలోని కార్గిల్ కాలనీ సమీపంలో అమృత్ స్కీం కింద మంజూరైన రూ.4.5 కోట్ల విలువైన పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పీఎం ఆవాస్ యోజన కింద ఇళ్ల నిర్మాణానికి కేంద్రం నిధులు మంజూరు చేస్తే రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లకు మళ్లిస్తుందని ఆరోపించారు. ఇందిరమ్మ ఇళ్లకు కేంద్ర నిధులు వాడుకుంటే ఊరుకునేది లేదన్నారు. అమృత్‌స్కీం కింద మున్సిపాలిటీల అభివృద్ధికి కేంద్రం భారీగా నిధులు మంజూరు చేస్తుందన్నారు. ఈ స్కీం కింద కొడంగల్ నియోజకవర్గానికి ఇప్పటివరకు మొత్తం రూ.17 కోట్లు మంజూరైనట్లు ఆమె తెలిపారు. ఈ స్కీం ద్వారా కొడంగల్ మున్సిపాలిటీలో ప్రతీ ఇంటికి తాగునీరు సరఫరా అవుతుందన్నారు. అలాగే మహబూబ్‌నగర్ మున్సిపాలిటీకి రూ.100 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. కేంద్రం నుంచి వచ్చిన నిధులతోనే గ్రామాల్లో వైకుంఠధామాలు, రైతు వేదికల నిర్మాణాలు చేపట్టారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, వైస్ చైర్‌పర్సన్ ఉషారాణి రాజేందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్ తదితరులు భూమి పూజ చేశారు.

నేటి నుంచి 'ఎమ్మెల్యే బీఎంఆర్ కప్'

నియోజకవర్గ స్థాయిలో పోటీలు
ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సైతం అవకాశం

7

భూగర్భం.. గరళం

ఉమ్మడి జిల్లాలో విస్తరిస్తున్న ఫ్లోరైడ్ భూతం



ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో తాగు, సాగునీటిలో పరిమితికి మించి ఫ్లోరైడ్, రసాయన అవశేషాలు ఉండడం ఆందోళన కలిగిస్తోంది. కేంద్ర భూగర్భ జల మండలి(సీజీడబ్ల్యూబీ) తాజాగా విడుదల చేసిన వార్షిక భూగర్భజలాల నాణ్యత నివేదికలో పలు ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. పలు ప్రాంతాల్లో తాగు, సాగునీరు అంత సురక్షితం కాదని పరీక్షల్లో తేలింది. అనేక మండలాల్లో ఫ్లోరైడ్ విస్తరించడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. అలాగే నీటిలో నత్రజని శాతం పరిమితికి మించి ఉన్నట్లు తేలింది. దేశంలోనే అత్యధిక నత్రజని (నీటిలో) ఉన్న 16 జిల్లాలను ప్రకటించగా ఇందులో రంగారెడ్డి జిల్లా మూడో స్థానంలో ఉన్నట్లు నివేదికలో పేర్కొవడం గమనార్హం.

- రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో రసాయన అవశేషాలు
- రంగారెడ్డిలో దేశంలోనే అధికంగా నత్రజని
- పరిమితికి మించి రసాయన అవశేషాలు
- వికారాబాద్ జిల్లాలో 100 శాతం సురక్షితం
- కేంద్ర భూగర్భ జలమండలి తాజా నివేదికలో వెల్లడి

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి): రంగారెడ్డి జిల్లాలో 70 నీటి నమూనాలు తీసుకుని పరీక్షించగా అందులో 44 చోట్ల నత్రజని అధికంగా ఉన్నట్లు తేలింది. అంటే సగటు 62.86 శాతం నీటిలో నత్రజని శాతం పరిమితికి మించి ఉంది. నత్రజని ఆధారిత ఎరువులు, జంతు వ్యర్థాలను ఎక్కువగా వినియోగించే ప్రాంతాల్లో ఈ పరిస్థితి నెలకొందని పేర్కొంది. తాజా నివేదికలో పెరుగుతున్న జల కాలుష్యం, దానివల్ల వచ్చే అనారోగ్య సమస్యలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. అనేక ప్రాంతాల్లో ఫ్లోరైడ్ పరిమితికి మించి క్రమేపీ

మిగతా 7వ పేజీలో...



ఫ్లోరైడ్ మండలాలు

రంగారెడ్డి జిల్లా : మంచాల, యాచారం, ఆమనగల్లు, ఇబ్రహీంపట్నం, మాడ్గుల, కేశంపేట, కొందుర్గు, కొత్తూరు.
మేడ్చల్ జిల్లా : బాచుపల్లి, బాలానగర్, దుండిగల్, ఘట్‌కేసర్, మల్కాజిగిరి, మేడ్చల్

మూడు జిల్లాల్లో నీటి పరీక్షల ఫలితాలు(శాతాల్లో)

	సురక్షితం	పాక్షిక కలుషితం	ప్రమాదకరం	అత్యంత ప్రమాదకరం
రంగారెడ్డి	59.26	22.22	3.7	14.81
మేడ్చల్	33.33	33.33	20	13.33
వికారాబాద్	100	0	0	0

ప్రమాదంలో ఈ మండలాలు

రాజేంద్రనగర్, చౌదరిగూడెం, హయత్‌నగర్, శేరిలింగంపల్లి, సరూర్‌నగర్, ఆల్వాల్, మేడ్చల్, ఘట్‌కేసర్, మూడు చింతలపల్లి, కీసర, మల్కాజిగిరి, బాచుపల్లి మండలాల్లో భూగర్భజలాలు కలుషితమవుతున్నట్లు తేలింది. భూగర్భజలాల విషయంలో వికారాబాద్ జిల్లా అత్యంత సురక్షితంగా తేలింది. ఇక్కడ 100 శాతం తాగునీరు సురక్షితమని నివేదికలో వెల్లడైంది.

మొబైల్ కేన్సర్ స్ర్కీనింగ్ యూనిట్ ప్రారంభం


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రఘునాథస్వామి

మేడ్చల్ ప్రతినిధి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మొబైల్ మహిళా కేన్సర్ స్ర్కీనింగ్ యూనిట్‌ను మంగళవారం జిల్లా వైద్యాధికారి రఘునాథస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల్లో అధికంగా కనిపించే రొమ్ము కేన్సర్‌ను త్వరగా గుర్తించడం ప్రధానమన్నారు. మొబైల్ మహిళా కేన్సర్ స్ర్కీనింగ్ యూనిట్ గ్రామీణ, వెనుకబడ్డ ప్రాంతాల్లోని మహిళలకు రొమ్ము కేన్సర్ స్ర్కీనింగ్ కోసం అవసరమైన సదుపాయాలను అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో పలువురు మెడికల్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

బాలుడి మృతి దురదృష్టకరం

ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామచంద్రయ్య



వికారాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రిలో బాలుడు మృతి చెందడం దురదృష్టకరమని, భవిష్యత్తులో ఇలాంటివి జరుగకుండా జాగ్రత్తలు తీసుకుంటామని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామచంద్రయ్య మంగళవారం ఆంధ్రజ్యోతితో తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో 24 గంటల సర్వీసుతో పేదలకు మెరుగైన వైద్యం అందిస్తున్నామన్నారు. డబ్బు లేని వారే ప్రభుత్వ ఆసుపత్రికి వస్తారనే కోణంలో ఆస్పత్రికి వచ్చే ప్రతీ రోగిని జాగ్రత్తగా చూసి అవసరమైన చికిత్స అందిస్తున్నామని ఆయన తెలిపారు. మొత్తం 56 మంది డాక్టర్లు, 164 మంది నర్సింగ్ కేడర్‌తో హస్పిటల్ నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో నిన్న జరిగిన సంఘటనపై విచారణ కమిటీ రిపోర్టు ఆధారంగా చర్యలు తీసుకుంటామన్నారు.

ముగిసిన సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మె

ఛ్చ.. నిరాశే!

- డిమాండ్లు నెరవేరకుండానే ముగిసిందంటూ కన్నీటి పర్యంతం
- కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు సమ్మె విరమణ పత్రం అందజేత
- నేటి నుంచి విధులకు హాజరుకానున్న ఉద్యోగులు


కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు సమ్మె విరమణ పత్రం అందజేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

వికారాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరవధిక సమ్మె ముగిసింది. తమ డిమాండ్ల సాధన కోసం నెల రోజులుగా సమ్మె చేపట్టిన ఉద్యోగులు బుధవారం తమ విధుల్లో చేరనున్నారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ రాకుండానే సమ్మెకు ముగింపు పలకాల్సి వచ్చిందంటూ కన్నీటి పర్యంతమయ్యారు. తమ డిమాండ్ల పరిష్కారం కోసం ఆర్డీవో కార్యాలయం ఎదుట గత నెల 6వ తేదీ నుంచి సమగ్ర శిక్షా ఉద్యోగులు నిరవధిక సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. జిల్లాలో సమగ్ర శిక్షలో వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న 728 మంది ఉద్యోగులు సమ్మెలో పాల్గొన్న విషయం విదితమే. ఇదిలా ఉంటే, సమగ్ర శిక్ష ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర నాయకులు సమ్మె ముగిస్తున్నట్లు సోమవారం రాత్రి ప్రకటించిన విషయం తెలిసిందే. తమ డిమాండ్ల పరిష్కారంపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ రాకుండానే సమ్మె ముగించాల్సి రావడం పట్ల పలువురు తీవ్రంగా మండిపడ్డారు.

అందరూ కలిసి కలెక్టరేట్‌కు వెళ్లి..

నెల రోజులుగా వివిధ రూపాల్లో నిరసన వ్యక్తం చేసినా చివరకు ఎలాంటి ప్రయోజనం లేకుండానే సమ్మెకు ముగింపు పలుకుతూ రాష్ట్ర నాయకత్వం నిర్ణయం తీసుకుందంటూ పలువురు ఉద్యోగులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్క డిమాండ్‌పై కూడా స్పష్టత లేకుండానే సమ్మె ముగించారంటూ పలువురు మహిళా ఉద్యోగులు కన్నీటి పర్యంతమయ్యారు. అనంతరం కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు సమ్మె విరమణ పత్రం అందజేశారు. కార్యక్రమంలో జేఏసీ జిల్లా అధ్యక్షుడు గంగ్యానాయక్, నాయకులు శేఖర్, ప్రభావతి పాల్గొన్నారు.

రైతు సహకార సంఘం పనితీరు భేష్

సెక్షన్ల వారీగా వివరాల సేకరణ
రైతులకు సౌకర్యాల కల్పన బాగుంది
శామీర్‌పేటలో ఒడిశా అధికారుల పర్యటన

7

రోడ్డంతా గుంతలమయం

ప్రమాదాలకు నిలయంగా మోత్కుపల్లి - వికారాబాద్ రోడ్డు
ప్రయాణికులకు తప్పని తిప్పలు
పట్టించుకోని పాలకులు

8


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

ఆంగ్ల బోధనకు ప్రాధాన్యమివ్వాలి

ఎంఈవోలు, హెచ్‌ఎంల సమావేశంలో కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల బోధనకు ప్రాధాన్యత కల్పించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో పాఠశాలల్లో ఆంగ్ల భాషలో సులభంగా బోధన చేయడంపై మండల విద్యాధికారులు, ప్రిన్సిపాల్స్, ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల్లో ప్రొజెక్టర్ల ద్వారా ఇంగ్లిష్ సినిమాలు చూయించడం వల్ల కూడా భాషలో ప్రావీణ్యత సాధించవచ్చని తెలిపారు. బోధనకు వీలుగా ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. డిసెంబర్ మాసంలో పు ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థినీ, విద్యార్థులకు ఇంగ్లీషులో నైపుణ్యాన్ని పెంపొందించాలని తెలిపారు. పాఠశాలలకు మౌలిక సదుపాయాలుకల్పించడంతో పాటు కంప్యూటర్లు, ఇంటర్నెట్ సౌకర్యం కల్పించేందుకు చర్యలుతీసుకుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, డీఈవో రేణుకాదేవి, వయోజన విద్య అధికారి శ్రీనివాస్ గౌడ్, మైనార్టీ బాలికల గురుకుల కళాశాల ప్రిన్సిపల్ మహబూబ్ ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ స్టాంపులపై అవగాహన కలిగి ఉండాలి

ప్రతి ఒక్కరూ నిత్య విద్యార్థులేనని తాను కూడా తెలుగు, కన్నడ భాషలను నేర్చుకోవడానికి ప్రయత్నిస్తున్నాని కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. మంగళవారం వికారాబాద్ మున్సిపల్ క్లబ్ ఫంక్షన్ హాల్‌లో పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న ప్రత్యేక స్టాంపుల ప్రదర్శన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే పోస్టల్ స్టాంపులపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఇలాంటి ప్రదర్శనలు విద్యార్థులకు ఎంతో ఉపయుక్తమని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని స్టాంపుల ప్రాముఖ్యత గురించి తెలుసుకోవాలన్నారు. అనంతరం అనంతగిరి ఫెక్స్ కార్యక్రమానికి ప్రత్యేకంగా రూపొందించిన లోగోను ఆవిష్కరించి ఫిలాటెలీ ఎక్స్‌బిషన్‌ను సందర్శించారు. కార్యక్రమంలో పోస్టల్ శాఖ అధికారులు సుబ్రహ్మణ్యం, ప్రసాద్, శ్రీనివాస్‌తో పాటు విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ ముల్లి పావని

రూ.6.8 కోట్ల విలువైన పనులకు తీర్మానం

మౌలిక సదుపాయల కల్పనకు చర్యలు
ఘట్‌కేసర్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ ముల్లి పావని

ఘట్‌కేసర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని అన్నారు. మంగళవారం బల్దియా కార్యాలయంలో ఆమె అధ్యక్షతన జరిగిన చివరి సర్వసభ్య సమావేశంలో రూ.6.80 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు పాలకవర్గం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపాలిటీలోని ఆయా వార్డులతోపాటు విలీన గ్రామాల్లో పలు అభివృద్ధి పనులు చేపట్టడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.4.10 కోట్లు, భూగర్భ డ్రైనేజీల నిర్మాణానికి రూ.1.20 కోట్లు, తాగునీటి పైప్‌లైన్ల నిర్మాణానికి రూ.25లక్షలు, ఓపెన్ జిమ్‌ల ఏర్పాటుకు రూ.22లక్షలు, సీసీ రోడ్ల మరమ్మతులకు రూ.15లక్షలు, వీధిదీపాల మరమ్మతులకు రూ.10లక్షలు, శానిటేషన్ వాహనాల మరమ్మతులకు రూ.10లక్షలు, ఎదులాబాద్ రోడ్డు నుంచి మాధవరెడ్డి రైల్వే వంతెన వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.50లక్షలు, ఇతర పనులకు రూ.18లక్షలు వెచ్చించాలని తీర్మానించారు. కార్యక్రమంలో కమిషనర్ చంద్రశేఖర్, వైస్ చైర్మన్ మాధవరెడ్డి, మేనేజర్ వెంకటరెడ్డి, కౌన్సిలర్లు. ఆయా విభాల అధికారులు పాల్గొన్నారు.

బాలలను పనిలో చేర్చుకుంటే చర్యలు

- అదనపు కలెక్టర్ రాధికా గుప్తా


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాధికా గుప్తా

మేడ్చల్ ప్రతినిధి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): బాలలను పనిలో చేర్చుకుంటే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ రాధికా గుప్తా హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆపరేషన్ స్మైల్, వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అందరి సమన్వయంతో బాలల రక్షణకు, భద్రతకు సహకారం అందించాలని కోరారు. జిల్లా మహిళా శిశు సంక్షేమాధికారి స్వర్ణలత మాట్లాడుతూ 14 ఏళ్లలోపు ఉన్న బాల కార్మికులకు రక్షించాలన్నారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు రామ్మోహన్ మాట్లాడుతూ బాలల రక్షణ, సంరక్షణకు జనవరి 31 వరకు ఆపరేషన్ స్మైల్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో డీఎంహెచ్‌వో రఘునాథస్వామి, అధికారులు నాగమణి, ఇంతియాజ్ రహీం, తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్ ప్లాన్‌లో అందరి భాగస్వామ్యం

- జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సుధీర్

వికారాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ మున్సిపాలిటీ మాస్టర్ ప్లాన్ రూపొందించడంలో అందరి భాగస్వామ్యం ఉండాలని అదనపు కలెక్టర్ సుధీర్ తెలిపారు. మంగళవారం బల్దియా మాస్టర్ ప్లాన్ రూపకల్పనపై పరిపాలన, పట్టణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో కౌన్సిలర్లు, ఇంజనీర్లు, వార్డు అధికారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా మాస్టర్ ప్లాన్ ఉండాలని తెలిపారు. పారిశ్రామిక, శ్మశాన వాటిక, గృహ అవసరాల కోసం జోన్లను గుర్తించే క్రమంలో కూడా ప్రజలకు ఆమోదయోగంగా ఉండాలన్నారు. మాస్టర్ ప్లాన్‌రూపొందించడంలో భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా ఉండాలన్నారు. ఇందుకు స్థానిక అభిప్రాయాలను తీసుకొని కౌన్సిల్‌లో అందరి ఆమోదంతో ప్రతిపాదనలు రూపొందించి సమర్పించాలని ఆయన సూచించారు. మాస్టర్ ప్లాన్‌లో పొరబాట్లు జరుగకుండా ఇంటి ఇంటి సామాజిక ఆర్థిక సర్వేలో భాగంగా సేకరించిన ప్రజల అభిప్రాయాలను కూడా తీసుకోవాలని సూచించారు. మాస్టర్ ప్లాన్ రూపొందించడంలో కౌన్సిలర్లు ఇచ్చిన సూచనలు, సలహాలను పరిగణలోకి తీసుకుంటామని తెలిపారు. అవగాహన కార్యక్రమంలో డీటీసీసీ అదనపు డైరెక్టర్ రమేశ్‌బాబు, మునిసిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేశ్, కమిషనర్ జాకీర్ అహ్మద్, మున్సిపల్ కౌన్సిలర్లు అధికారులు పాల్గొన్నారు.







మక్తాలో విషాదఛాయలు

పోలీసుల బందోబస్తు మధ్య లిఖిత అంత్యక్రియలు



ఆత్మహత్యకు కారణమైన మహేశ్(చింటు) ఇంటి ఎదుట ఆందోళన చేస్తున్న లిఖిత బంధువులు

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రేమజంటను వేధింపులకు గురి చేసి వారి ఆత్మహత్యకు కారణమైన యువకుడి ఇంటి ఎదుట బాలిక లిఖిత(17) బంధువులు, గ్రామస్తులు ఆందోళనకు దిగారు. దీంతో మేడ్చల్ జిల్లా పోచారం మున్సిపాలిటీ, మక్తా గ్రామంలో మంగళవారం విషాదఛాయలు నెలకొన్నాయి. బాలిక లిఖిత మృతదేహానికి మంగళవారం గాంధీ ఆస్పత్రిలో పోస్టుమార్టం ముగియాగానే నేరుగా మక్తాలోని ముంత మహేష్ (చింటు) యాదవ్ ఇంటి వద్దకు తీసుకొచ్చి ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు మక్తా గ్రామానికి చేరుకొని ఆందోళనను విరమించే ప్రయత్నం చేశారు. మృతదేహానికి మహేశ్ ఇంటి ఎదుటే దహన సంస్కారాలు చేస్తామని బాలిక బంధువులు, గ్రామస్తులు భీష్మించారు. బాలిక మృతికి కారణమైన మహేశ్‌ను కఠినంగా శిక్షించాలని, తమకు న్యాయం జరిగే వరకు ఇక్కడి నుంచి కదలమని నినాదాలు చేశారు. మృతదేహానికి మహేశ్ ఇంటి ఆవరణలోనే అంత్యక్రియలు చేసేందుకు కట్టెలు పెట్టి నిప్పంటిస్తుండటంతో పోలీసులు వారిని చెదరగొట్టారు. మహేశ్ ఇంటిపైకి ఎవరిని రానివ్వకుండ పోలీసులు వారిని బయటకు పంపించారు. మల్కాజిగిరి సీఐ చక్రపాణి, స్థానిక సీఐ రాజువర్మలు బాలిక బంధువులను సముదాయించి అక్కడి నుంచి పంపించారు. పోలీసు బందోబస్తు మధ్య లిఖిత అంతిమయాత్ర కొనసాగింది. ప్రేమజంట ఆత్మహత్యకు కారణమైన మహేశ్‌ను పోలీసుల అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. పోలీసులు అన్ని కోణాల్లో విచారిస్తున్నట్లు తెలిపారు.

పీఆర్ రోడ్ల ఆధునీకరణకు రూ.91.51 కోట్లు మంజూరు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): కల్వకుర్తి నియోజకవర్గంలో పంచాయతీ రాజ్ ఆధీనంలోని రహదారుల ఆధునీకరణ, వంతెనల నిర్మాణానికి రాష్ట్రప్రభుత్వం రూ.91.51 కోట్లు మంజూరు చేసిందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. కల్వకుర్తి, వెల్దండ, చారగొండ మండలాల పరిధిలో 13 రోడ్లు, 5 వంతెనల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ అయినట్లు చెప్పారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో మిషన్ భగీరథ, విద్యుత్, పంచాయతీ రాజ్ శాఖల సమీక్ష సమావేశం ఎమ్మెల్యే అధ్యక్షతన నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. తాగునీటి సమస్యలు ఉత్పన్నం కాకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. మిషన్ భగీరథ పనుల నిర్వాహణకు రూ.1.64 కోట్లు మంజూరైనట్లు చెప్పారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి ఇటీవల ప్రభుత్వం రూ.2.11 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. గ్రామీణ రోడ్ల మరమ్మతు, ఆధునీకరణకు రూ.500 కోట్లు మంజూరు చేయాలని సీఎంను కోరగా.. ఇప్పటి వరకు రూ.295కోట్లు విడుదల చేసినట్లు వివరించారు. మాడ్గుల, వెల్దండ మండలాల పరిధిలో పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు రూ.20.43 కోట్లు మంజూరైనట్లు చెప్పారు. అధికారులు విజయ్‌మార్, బస్వలింగం, షబ్బీర్, మోహన్‌రెడ్డి, స్రవంతి, శ్రావ్య, మణిపాల్, శ్రీనివాస్, శెట్టి, ఏఎంసీ చైర్‌పర్సన్లు గీత, మనీలా సంజీవ, నాయకులు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, భట్టు కిషన్‌రెడ్డి, గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, భూపతిరెడ్డి, యాట నర్సింహ, శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, జగన్, బీచ్యనాయక్, మానయ్య, తదితరులు పాల్గొన్నారు.





సమరశీల పోరాటాలు కొనసాగిస్తాం



సీపీఐ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

మంచాల, జనవరి 7(ఆంధ్రజ్యోతి): నిరుపేదల పక్షాన సమరశీల పోరాటాలు కొనసాగిస్తామని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఓరుగంటి యాదయ్య అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ శతవసంతాల ఆవిర్భావ ఉత్సవాలను పురస్కరించుకొని మంగళవారం మండలంలోని జాపాలలో సీపీఐ జెండాను ఆవిష్కరించారు. యాదయ్య మాట్లాడుతూ బ్రిటీష్ సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా 1925 డిసెంబరు 25న ఆవిర్భవించిన సీపీఐ శతవసంతాలు పూర్తిచేసుకుందని గుర్తుచేశారు. నాయకులు నర్ల శ్రీశైలం, ఎండీ అలీమొద్దీన్, రాజూనాయక్, అనంతరెడ్డి, ఎల్.అనంతరెడ్డి, బి.బాలయ్య, మోత్యానాయక్, ఓరుగంటి మల్లయ్య, పి.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించని హోటళ్లపై కఠిన చర్యలు



తుక్కుగూడలోని హోటల్‌ను తనిఖీ చేస్తున్న కమిషనర్ వాణి

మహేశ్వరం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని హోటళ్ల పరిశుభ్రత పాటించడంతో పాటు ఆహార పదార్థాల వినియోగంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, లేనిచో కఠిన చర్యలు తీసుకుంటామని తుక్కుగూడ మున్సిపల్ కమిషనర్ వాణి అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని పలు హోటళ్లను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ హోటళ్లలో పరిశుభ్రత పాటించడం, వ్యాపార లైసెన్సులు పొందడం, లేబర్ లైసెన్స్ కలిగి ఉండాలని, ఫుడ్ లైసెన్స్‌లు లేకుండా హోటళ్ల నిర్వహించరాదని చెప్పారు. నిబంధనలు పాటించని నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు జరిమానాలు విధిస్తామన్నారు. హోటళ్లలో డొమెస్టిక్ సిలిండర్లు వాడకూడదన్నారు.

పల్లె ప్రగతి పనులకు బిహార్ ప్రతినిధుల బృందం కితాబు



మాట్లాడుతున్న లక్ష్మీనర్సింహారెడ్డి

కడ్తాల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): పల్లె ప్రగతి కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో గ్రామాలు ఎంతగానో అభివృద్ధి సాధించాయని బిహార్ ప్రజాప్రతినిధులు, అధికారుల బృందం కితాబు ఇచ్చినట్లు రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి తెలిపారు. పల్లె ప్రగతి కార్యక్రమం ద్వారా గ్రామాల ప్రజలకు మౌలిక వసతులు ఒనగూడిన తీరు బాగుందని వారు ప్రశంసించినట్లు చెప్పారు. రాజేంద్రనగర్‌లోని జాతీయ పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి సంస్థలో 4 రోజుల శిక్షణ కార్యక్రమానికి బిహార్ బ్లాక్‌స్థాయి ప్రజాప్రతినిధులు, అధికారుల బృందం హాజరైంది. శిక్షణ కార్యక్రమంలో ఎన్ఐఆర్డీపీఆర్ రిసోర్స్ పర్సన్‌గా లక్ష్మీనర్సింహారెడ్డి పాల్గొన్నారు. పల్లెప్రగతి కార్యక్రమం ద్వారా గ్రామ పంచాయతీల పరిధిలో చేపట్టిన పల్లె ప్రకృతివనాలు, రైతు వేదికలు, వైకుంఠధామాలు, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం, హరితహారం మొక్కల పెంపకం, ఇంకుడు గుంతలు, పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణ తదితర విషయాలపై బృందానికి వివరించినట్లు తెలిపారు. బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ షాపుల్లో అధికారుల తనిఖీలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



తనిఖీలు నిర్వహిస్తున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్

మూడుచింతలపల్లి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మూడుచింతలపల్లిలో పుట్టగొడుగుల్లా వెలుస్తున్న మెడికల్ షాపులపై 'మెడికిల్ దందా!' అనే శీర్షికన మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మండలంలోని ఉద్దెమర్రి, మూడుచింతలపల్లి గ్రామాల్లోని బాలాజీ, సాయికృష్ణ, శ్రీ వెంకటేశ్వర మెడికల్ షాపుల్లో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు అందజేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రైతు సహకార సంఘం పనితీరు భేష్



శామీర్‌పేట రైతు సహకార సంఘం కార్యాలయంలో ఒరిస్సా అధికారుల బృందానికి వివరిస్తున్న చైర్మన్ మధుకర్‌రెడ్డి

శామీర్‌పేట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): శామీర్‌పేట రైతు సహకార సంఘాన్ని మంగళవారం ఒడిశా రాష్ట్రానికి చెందిన కోఆపరేటివ్ శాఖ ఉన్నతాధికారుల బృందం సందర్శించింది. అధికారుల బృందానికి రైతు సహకార సంఘం చైర్మన్ మధుకర్‌రెడ్డి, వైస్‌చైర్మన్ మ్యాకల ఐలయ్య, డైరెక్టర్లు స్వాగతం పలుకుతూ సంఘం సాధించిన అభివృద్ధి పనులను వివరించారు. సహకార సంఘం అభివృద్ధి బాగుందని, పనితీరు భేషుగ్గా ఉందని అధికారుల బృందం అభినందించింది. ఒడిశా రాష్ట్ర కోఆపరేటివ్ శాఖకు చెందిన 22మంది ఉన్నతాధికారులు శామీర్‌పేట రైతు సహకార సంఘానికి విచ్చేసి సెక్షన్ల వారీగా పనితీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. సహకార సంఘాన్ని నష్టాల నుంచి అభివృద్ధి పథంలోకి ఎలా తీసుకవచ్చారని, ప్రస్తుతం పరిస్థితి ఎలా ఉందని ఆ సంఘం చైర్మన్ మధుకర్‌రెడ్డిని అధికారుల బృందం స్పష్టంగా అడిగి తెలుసుకున్నారు. సహకార సంఘం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, సంఘం నుంచి రైతులకు చేయూత, రైతులకు కావల్సిన సౌకర్యాల కల్పన చాలా బాగుందని ఒరిస్సా అధికారుల బృందం చైర్మన్ మధుకర్‌రెడ్డిని అభినందించారు. ఇలాంటి సహకార సంఘాలు ఉంటే రైతులకు ఎంతో లాభదాయకంగా ఉంటుందని కితాబిచ్చారు.

ఉద్యమాలపై ప్రభుత్వం ఉక్కుపాదం!



కుర్మిద్దలో ఫార్మాసిటీ వ్యతిరేక ఉద్యమకారుల ర్యాలీ (ఫైల్)



సభలు, ర్యాలీలకు అనుమతి తప్పనిసరి

"ఫ్యూచర్‌సిటీ రోడ్డుకు భూసేకరణ చేయవద్దని, దానిని రద్దుచేయాలని ర్యాలీలు, సభలు సమావేశాలు పెట్టుకోవావాలంటే విధిగా అనుమతి పొందాలి. లేనిచో చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. ఎట్టి పరిస్థితుల్లో ప్రజలకు ఇబ్బంది కలిగించొద్దు. పోలీసుల అనుమతి లేకుండా ఎలాంటి కార్యక్రమాలు చేపట్టరాదు.

- లిక్కి కృష్ణంరాజు, సీఐ, హైదరాబాద్ గ్రీన్‌ఫార్మాసిటీ

- సభలు, ర్యాలీలపై పోలీసుల నజర్
- ఫార్మాసిటీ ఏర్పాటుకు వ్యతిరేకంగా ఆందోళన కార్యక్రమాలపై గుర్రు

యాచారం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): గత కొన్ని రోజులుగా ఫార్మాసిటీకి వ్యతిరేకంగా ఉద్యమాలు, ఫ్యూచర్ సిటీకి సంబంధించిన రోడ్డుకు భూ సేకరణ చేయవద్దని ర్యాలీలు, సభలు సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో ప్రభుత్వం ఉద్యమాలు, ఆందోళనలు చేపట్టవద్దని, అనుమతి తీసుకొని మాత్రమే కార్యక్రమాలు నిర్వహించాలని హెచ్చరికలు చేస్తోంది. మండలంలోని కుర్మిద్ద, తాటిపర్తి గ్రామాల్లో ఆందోళన కారులు ఇటీవల బాధితులు ర్యాలీలు నిర్వహించారు. ఈమేరకు పలు పత్రికల్లో ప్రచురితమైన కథనాలకు రాచకొండ పోలీస్ ఉన్నతాధికారులతో పాటు సీఎంవో అధికారులు అప్రమత్తమయ్యారు. దాంతో సభలు, ర్యాలీలు, సమావేశాలు పెట్టాలంటే ముందుగా పోలీస్ కమిషనరేట్ నుంచి విధిగా అనుమతి తీసుకోవాలని ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు విశ్వసనీయ సమాచారం. దాంతో ఫార్మాసిటీ వ్యతిరేక ఉద్యమంపై రాచకొండ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. తాము అధికారంలోకి వస్తే.. కొత్తగా భూసేకరణ చేయమని, ఫార్మాసిటీ రద్దు చేస్తామని ఎన్నికలకు ముందు మాట ఇచ్చిన కాంగ్రెస్ నాయకులు.. నేడు మాట తప్పుతున్నారని ఆందోళనకారులు మండిపడుతున్నారు. ఫ్యూచర్ సిటీ రోడ్డు కోసం యాచారం మండలంలోని కుర్మిద్దలో 529మంది రైతులకు చెందిన పట్టా, ప్రభుత్వ భూములను 144ఎకరాల 7గుంటలు సేకరించడానికి ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయడంపై రైతులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ఫ్యూచర్ సిటీ కోసం మళ్లీ భూసేకరణ చేస్తే.. 529 మంది రైతులు వీధిన పడతారు. వారంతా ఎకరం, అరెకరం భూములున్న నిరుపేద రైతులే. ఫార్మాసిటీ కొరకు 19,333ఎకరాల భూమి సేకరించాల్సి ఉండగా.. ప్రభుత్వ, అసైన్డ్ భూములు 4 వేల ఎకరాలు సేకరించారు. పట్టాభూములు 6 వేల ఎకరాలకు గాను నాలుగు వేల ఎకరాల భూములు సేకరించారు. మరో 2 వేల ఎకరాల భూములపై కోర్టు కేసులు నడుస్తున్నాయి. మరో 1,994 ఎకరాల 28 గుంటల భూమిని గతప్రభుత్వం నిషేధిత జాబితాలో పెట్టింది. ఆ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించి ఆన్‌లైన్‌లో రైతుల పేర్లు నమోదు చేసి క్రయ విక్రయాలు జరుపుకునేట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలని ఆందోళన కారులు డిమాండ్ చేస్తున్నారు.

అయితే, ఆ భూములను ఎందుకోసం తీసుకుంటారో తెలియని పరిస్థితి నెలకొంది. ఫార్మాసిటీ వ్యతిరేక ఉద్యమాన్ని నీరు గార్చడానికి పోలీస్ యంత్రాంగం ఎన్ని ప్రయత్నాలు చేసినా భయపడేది లేదని, శాంతియుతంగా ఉద్యమాలు చేయడానికి వెనుకాడే ప్రసక్తే లేదని ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు తేల్చి చెబుతున్నారు. ఫార్మాసిటీని రద్దుచేసి నిషేధిత జాబితాలో ఉన్న భూములను రైతుల పేరిట ఆన్‌లైన్‌లో నమోదు చేసేదాకా పోరాటం ఆపేదిలేదని ఆందోళన కారులు చెబుతున్నారు.

నేటి నుంచి 'ఎమ్మెల్యే బీఎంఆర్ కప్' పోటీలు

తాండూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో క్రీడాపోటీలు నిర్వహించాలని నిర్ణయించారు. 'ఎమ్మెల్యే బీఎంఆర్ కప్' పేరిట నేటి(బుధవారం) నుంచి 11వ తేదీ వరకు టోర్నమెంట్‌ను నిర్వహించనున్నారు. నియోజకవర్గ స్థాయిలో తాండూరు పట్టణంతో పాటు యాలాల, బషీరాబాద్, పెద్దేముల్, తాండూరు మండలాల పాఠశాలల విద్యార్థులకు క్రీడలను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో ఈపోటీలను తాండూరు పట్టణం గౌతమి మోడల్ స్కూల్‌లో నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్ పోటీలను నిర్వహించనున్నారు. ఆసక్తి గలవారు సెల్‌నంబర్ 9701586893(పీడీ అనంతయ్య), 9951197417 (పిడి గోపాల్)లను సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు. బాలికలకు ప్రత్యేకంగా త్రోబాల్ పోటీలు నిర్వహించనున్నారు.

పాఠశాలలో నాగుపాము కలకలం



దోమ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి):మండలంలోని బడెంపల్లి ఉన్నత పాఠశాలలో నాగుపాము కలకలం రేపింది. పాఠశాల చుట్టూ వ్యవసాయ పొలాలు ఉండటంతో పాఠశాలలోకి నాగుపాము చొరబడింది. గమనించిన ఉపాధ్యాయులు అప్రమత్తమయ్యారు. పాములు పట్టే వ్యక్తిని పిలిపించి పామును పట్టించి బహిరంగ ప్రదేశంలో వదిలేశారు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఊపిరి పీల్చుకున్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



మంత్రి రాజనర్సింహకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ అర్బన్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): అర్హత కల్గిన ప్రతీ ఒక్కరికి సంక్షేమ ఫలాలను అందిస్తామని షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ తెలిపారు. షాద్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం రూ.కోటీ 50లక్షల కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు ఆయన అందించారు. అనంతరం శంకర్ మాట్లాడుతూ 136 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ కింద రూ.1,36,15,776కోట్లు, 30 మందికి రూ.13,93,500లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసినట్లు తెలిపారు. గత పాలకుల నిర్వాకం వల్ల ప్రభుత్వం నిధుల కొరతను ఎదుర్కొంటున్నా.. ఏ సంక్షేమ పథకాన్నీ ఆపకుండా ముందుకు సాగుతున్నామని తెలిపారు. అవినీతికి ఆస్కారం లేకుండా పారదర్శకంగా పాలన సాగిస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి ప్రజలు వచ్చి సమస్యలు తెలిపితే పరిష్కరిస్తున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజల కోసం టీ, టిఫిన్లు, భోజన వసతిని సైతం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసి, పారదర్శంగా ముందుకు సాగుతుంటే.. కొందరు మీడియా ముసుగులో తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. అసత్య ప్రచారం చేస్తే సహించేదిలేదని శంకర్ హెచ్చరించారు.

ఇంటర్ విద్యార్థులకు ఉచిత భోజనం

షాద్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సొంత ఖర్చులతో మధ్యాహ్న భోజన వసతిని ఏర్పాటు చేసి మంగళవారం ప్రారంభించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు సైతం ఆకలితో అలమటించకుండా మూడు నెలల పాటు భోజనాన్ని అందిస్తామని తెలిపారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సర్వేశ్వర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, కాంగ్రెస్ నాయకులు ఎ.కృష్ణారెడ్డి, చిట్టెం దామోదర్‌రెడ్డి, చెంది తిరుపతిరెడ్డి, జి.బాల్‌రాజ్‌గౌడ్, రఘునాయక్, నర్సింహయాదవ్, కె.సూర్యప్రకాష్, కె.చెన్నయ్య, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రుల అభివృద్ధికి అదనపు నిధులివ్వండి

షాద్‌నగర్, కేశంపేట ప్రభుత్వ ఆసుపత్రుల భవన నిర్మాణాలు పూర్తి చేయడానికి అదనపు నిధులివ్వాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కోరారు. హైదరాబాద్‌లో మంగళవారం మంత్రిని కలిసి వినతిపత్రం ఇచ్చి అదనపు నిధులివ్వాలని కోరినట్టు ఎమ్మెల్యే తెలిపారు. షాద్‌నగర్‌లో నిర్మాణంలో ఉన్న 100 పడకల ఆసుపత్రి భవనాన్ని పూర్తి చేయడానికి రూ.5కోట్ల 31 లక్షలు, కేశంపేటలో నిర్మిస్తున్న 30 పడకల ఆసుపత్రి భవనాన్ని పూర్తి చేయడానికి రూ.22లక్షల 80 వేలు మంజూరు చేయాలని కోరినట్టు తెలిపారు. ఈమేరకు మంత్రి సానుకూలంగా స్పందించారని, అదనపు నిధులను మంజూరు చేస్తానని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే శంకర్ తెలిపారు.

జైపాల్ రెడ్డికి అరుదైన గౌరవం.. కాంగ్రెస్ నేతల సంబురాలు

- సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం
- ఆమనగల్లులో కాంగ్రెస్ నేతల ర్యాలీ



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు

ఆమనగల్లు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): పాలమూరు-రంగారెడ్డి ఎత్తి పోతల పథకానికి కేంద్ర మాజీ మంత్రి, ఉత్తమ పార్లమెంటేరియన్, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే, దివంగత సూదిని జైపాల్‌రెడ్డి పేరు నామకరణం చేయాలని రాష్ట్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని హర్షిస్తూ ఆమనగల్లు పట్టణంలో మంగళవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో సంబురాలు జరుపుకున్నారు. రాజీవ్ చౌక్‌వద్ద హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, ఉపాధ్యక్షుడు ఎంఏ ఖలీల్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు మండ్లీ రాములు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. కాంగ్రెస్ మండలాధ్యక్షులు జగన్, బీచ్యనాయక్, పట్టణాధ్యక్షుడు మానయ్యల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి కాంగ్రెస్, రేవంత్‌కు అనుకూలంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా శ్రీ పాతి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి దివంగత సూదిని జైపాల్ రెడ్డి పేరు పెట్టాలని కేబినెట్ తీసుకున్న నిర్ణయం హర్షదాయకమన్నారు. జైపాల్ రెడ్డి ఐదు దశాబ్దాల పాటు జాతీయ స్థాయిలో అందించిన సేవలకు అసలైన నివాళి అని కొనియాడారు. పాలమూరు బిడ్డ , నిస్వార్థ సేవా పరుడు జైపాల్ రెడ్డి సేవలను ప్రభుత్వం గుర్తించి భావితరాలు గుర్తుంచుకునేలా ఎత్తిపోతల పథకానికి పేరు పెట్టాలని నిర్ణయించడం గర్వకారణమన్నారు. మార్కెట్ డైరెక్టర్ వస్పుల శ్రీశైలం, నాయకులు కాలె మల్లయ్య, ఎంగళి ప్రసాద్, ఎంఏ అలీం, ఖాదర్ ఖాద్రీ, ఖాదర్, జవహర్‌లాల్ నాయక్, శంకర్, రాజశేఖర్, బాబా, సురేశ్, కండె సాయి, ఫరీద్, మైసయ్య, నాజర్,మహేశ్, సురేశ్, మల్లేశ్‌నాయక్, కృష్ణయ్య, విజేందర్, తదితరులు పాల్గొన్నారు.

భూగర్భం.. గరళం

(5వ పేజీ తరువాయి)

పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. గతేడాది సురక్షిత భూగర్భజలాలు ఉన్న పలు మండలాల్లో భూగర్భజలం ప్రమాదకరంగా మారింది. రుతుపవనాలకు ముందు సేకరించిన నీటి నమూనాల్లో కంటే వర్షాలు పడిన తర్వాత తీసుకున్న వాటిల్లో ఫ్లోరైడ్ శాతం తక్కువగా ఉండడం గమనార్హం.

బోరు నీటితో జాగ్రత్త తప్పనిసరి

వికారాబాద్, రంగారెడ్డి జిల్లాలో సోడియం కార్బోనేట్ అధిక శాతం ఉంది. ఉదాహరణకు రంగారెడ్డి జిల్లాలో 27 చోట్ల నమూనాలు తీసుకుని పరీక్షలు నిర్వహించగా ఇందులో 16 చోట్ల అంటే 59.26 శాతం తాగునీరు సురక్షితమని తేలింది. మిగతా చోట్ల భూగర్భజలాలు అంత సురక్షితం కాదని వెల్లడైంది. ఇందులో 14.81 శాతం నమూనాల్లో భూగర్భజలం అత్యంత ప్రమాదకరంగా ఉందని తేలింది. ఉమ్మడి జిల్లాల్లో అత్యధిక శాతం ప్రజలు ప్రభుత్వం సరఫరా చేస్తున్న శుద్ధ జలాలు, ఆర్వో ప్లాంట్ల నీటిని తాగుతున్నప్పటికీ ఇంకా కొన్ని మారుమూల ప్రాంతాల్లో బోరు నీటిని తాగేందుకు ఉపయోగిస్తున్నారు. బోరు నీటిని తాగే ప్రజలు జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రమాదకర జబ్బుల బారిన పడే ప్రమాదం ఉంది.

ఎంత దాటితే ప్రమాదకరం?

వాస్తవానికి లీటరు జలంలో 1.50 మిల్లీ గ్రాములకు మించి ఫ్లోరైడ్ ఉంటే ఈ నీరు సురక్షితం కాదు. అలాగే 45 మిల్లీ గ్రాములకు మించి నత్రజని, 1.50 మిల్లీ గ్రాములకు మించి సోడియం కార్బొనేట్ ఉంటే పరిమితికి మించి ఉంటే ఆ నీరు తాగడానికి పనికి రాదు. ఉమ్మడి జిల్లాల్లో పలు చోట్ల సేకరించిన నమూనాల్లో ఫ్లోరైడ్, నైట్రేట్, సోడియం కార్బోనేట్ పరిమితికి మించి పరీక్షల్లో తేలింది. భూగర్భ జలాలను ఎక్కువగా వినియోగిస్తున్న ప్రాంతాల్లో ఫ్లోరైడ్ పెరుగుతోంది. ఈ నీరు తాగిన వారు ఫ్లోరోసిస్ వ్యాధికి గురవుతుంటారు. అలాగే భూగర్భజలాల్లో నత్రజని అధిక శాతంలో ఉండడం వల్ల కూడా ఆ నీరు సురక్షితం కాదు. పంటల సాగులో మోతాదుకు మించి రసాయన ఎరువులు వాడుతుండడం వల్ల ఈ సమస్యలు తలెత్తుతున్నట్లు నిపుణులు చెబుతున్నారు. జిల్లాల్లో సేకరించిన నమూనాల్లో పలు చోట్ల సోడియం కార్బోనేట్ పరిమితికి మించి ఉన్నట్లు తాజా నివేదిక స్పష్టం చేసింది. ఇది పంటల దిగుబడిపై ప్రభావం చూపుతుందని అధికారులు చెబుతున్నారు.

వైభవంగా మైసమ్మ పండుగ



వేడుకల్లో గ్రామస్తులు

వికారాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): గొట్టిముక్లలో మంగళవారం మైసమ్మ పండుగ వైభవంగా నిర్వహించారు. ప్రతీ మూడు సంవత్సరాలకు ఒక సారి మైసమ్మ పండుగను ఆనవాయితీగా నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో డప్పుచప్పుళ్ల మధ్య జోగినితో బోనం తీయించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అనంతరం మైసమ్మ ఆలయం వద్ద మాతంగి గ్రామ భవిష్యవాణి వినిపించారు. పోతురాజుల విన్యాసాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు మాణిక్యరెడ్డి, సాయన్న, లాలయ్య, గోపాల్, బాల్‌రాజ్, మల్లేశ్ యువకులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకోవాలి

మహేశ్వరం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): నియమ నిబంధనలు పాటించకుండా మహేశ్వరంలో అక్రమంగా వెలుస్తున్న రియల్ వెంచర్లపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం పట్టణాధ్యక్షుడు బంగరిగల్ల లాజర్ అన్నారు. అక్రమమ వెంచర్లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం తహసీల్దార్, ఎంపీవోలకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ మహేశ్వరం రెవెన్యూలోని సర్వేనెంబర్లు 350, 375లలో వ్యవసాయ భూమిని ఎలాంటి కన్వర్షన్ చేయకుండా ప్లాట్లుగా తయారు చేసి అడ్డగోలుగా విక్రయిస్తున్నారన్నారు. దాంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడడంతో పాటు ప్లాట్లు కొనుగోలు చేసిన వారు అనేక ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందని, విచారణ చేపట్టి సంబంధిత వ్యక్తులపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అంగన్‌వాడీ టీచర్లకు వేతనాలు చెల్లించాలి

చౌదరిగూడ, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అంగన్వాడీ టీచర్లకు వేతనాలు వెంటనే చెల్లించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బుద్దుల జంగయ్య డిమాండ్ చేశారు. మంగళవారం ఏఐటీయూసీ పిలుపు మేరకు కొందుర్గు మండల తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ ప్రకాశ్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో పని చేస్తున్న అంగన్వాడీ టీచర్లకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని ఆరోపించారు. అంగన్వాడీ టీచర్లకు కనీస వేతన చట్టం ప్రకారం రూ. 26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న గ్యాస్, కూరగాయల బిల్లులను వెంటనే చెల్లించాలని కోరారు. ఏఐటీయూసీ నాయకులు నరసింహా, అంగన్వాడీ టీచర్లు యామిని, సువర్ణ, మానెమ్మ, శ్రీలత, ప్రమీల, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

తాండూరు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిపై ఫిర్యాదు



మున్సిపాలిటీ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు, కౌన్సిలర్ సోమ శేఖర్

తాండూరు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): తాండూరు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు హబీబ్ లాలపై మున్సిపల్ కమిషనర్ విక్రంసింహారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మున్సిపల్ యూనియన్ నాయకులతో కలిసి మంగళవారం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదును ఏఎస్ఐకి అందజేశారు. హబీబ్ లాల సోమవారం సాయంత్రం తనను దుర్భాషలాడటంతో పాటు దూషించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వెంటనే విధులకు ఆటంకం కలిగించడం కాకుండా దుర్భాషలాడినందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అంతకుముందు మున్సిపల్ కార్మికులు సమ్మెకు దిగారు. ఈ సమ్మెకు కౌన్సిలర్ సోమశేఖర్ మద్దతు ఇచ్చారు. మధ్యాహ్నం భోజన విరామం సమయంలో మున్సిపల్ ఉద్యోగులు యూనియన్ నాయకులతో కలిసి నల్లా బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ విషయంపై ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి దృష్టికి కౌన్సిలర్ సోమశేఖర్ తీసుకెళ్లారు.

అంబేడ్కర్ విగ్రహం తరలింపునకు చర్చలు

అంబేడ్కర్ సంఘం నేతలతో పోలీసుల భేటీ



మాట్లాడుతున్న ఏసీపీ వెంకట్ రెడ్డి

మేడ్చల్ టౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి అభివృద్ధి పనుల్లో భాగంగా పట్టణంలోని 44వ నంబర్ జాతీయ రహదారికి ప్రధాన కూడలి వద్ద ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని మరో చోటుకు తరలించటానికి పోలీసులు అంబేడ్కర్ సంఘం నాయకులతో మంగళవారం చర్చలు జరిపారు. మేడ్చల్ ట్రాఫిక్ పోలీస్ ఏసీపీ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ సమావేశాన్ని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ జాతీయ రహదారి వంతెన నిర్మాణపు పనుల్లో భాగంగా రోడ్డు సమీపంలోని పలు కట్టడాలను తొలగిస్తున్నామని వివరించారు. జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న పట్టణ ప్రధాన కూడలి వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్ర హాన్ని తరలించి వేరే ప్రాంతంలో ఏర్పాటు చేయాల్సివస్తుందని తెలిపారు. విగ్రహాన్ని పట్టణంలో ఎక్కడ ఆవిష్కరించాలన్న విషయమై సంఘం నేతల అభిప్రాయాన్ని కోరగా వారు సమ్మతించారు. విగ్రహం ఆవిష్కరించే ప్రదేశాన్ని కేటాయించి పూర్తి ఏర్పాట్లు చేసిన అనంతరం విగ్రహాన్ని తరలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐలు సత్యనారాయణ, హనుమాన్ గౌడ్, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి, అంబేడ్కర్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

రోడ్డంతా గుంతలమయం

- ప్రమాదాలకు నిలయంగా మోత్కుపల్లి - వికారాబాద్ రోడ్డు
- ప్రయాణికులకు తప్పని తిప్పలు
- పట్టించుకోని పాలకులు


మోత్కుపల్లి సమీపంలో గుంతలమయంగా రోడ్డు

కోట్‌పల్లి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోత్కుపల్లి బస్టాండ్ నుంచి వికారాబాద్ జిల్లా వరకు దాదాపు 20కిలోమీటర్లు వెళ్లే రోడ్డు పూర్తిగా గుంతలమయమైంది. దీంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమయానికి గమ్యస్థానానికి వెళ్లలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ మార్గంలో జిల్లా కేంద్రానికి నిత్యం వేలాది మంది ప్రయాణికులు వివిధ పనుల నిమిత్తం వెళ్తుంటారు. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, అనారోగ్యంతో ఆస్పత్రులకు వెళ్లే వారు సకాలంలో చేరుకోలేక పోతున్నామని వాపోతున్నారు. రోడ్డుసరిగా లేకపోవడంతో ఈరోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఈ మార్గంలో అనేక ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఎంతోమంది గాయాల పాలయ్యారు. పదేళ్ల కిందట ఈ మార్గంలో వేసిన ఈ రోడ్డు గుంతలమయమై రెండేళ్లుగా ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నామని వాపోతున్నారు. ప్రభుత్వాలు ఎన్ని మారినా ఈ రోడ్డు పరిస్థితి మాత్రం మారడంలేదని మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గుంతల రోడ్డును బాగు చేయాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.

ప్రభుత్వం మారినా ప్రయాణం మారలే



అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచినా రోడ్ల పరిస్థితి మారలేదు. మోత్కుపల్లి, మైలారం దేవరంపల్లి నుంచి ఎలా వెళ్లినా గుంతల రోడ్లలో ఇబ్బందులు పడుతున్నాం. సకాలంలో పనులు చేసుకోలేకపోతున్నాం. ఈ ప్రభుత్వమైనా స్పందించి రోడ్డు వేయాలి. **- భూపతిరెడ్డి, మోత్కుపల్లి**

టెండర్ ప్రక్రియ పూర్తయింది

సీఆర్ఎఫ్ నిధుల కింద 15 కిలోమీటర్లకుగాను రూ.30కోట్ల నిధులు డబుల్ రోడ్డు కోసం వికారాబాద్ నుంచి మోత్కుపల్లి వరకు టెండర్ ప్రక్రియపూర్తయింది. అగ్రిమెంట్ ప్రక్రియ పూర్తయితే పనులు ప్రారంభమవుతాయి. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా త్వరగా పూర్తయ్యేలా చూస్తాం.

- రవికుమార్, ఏఈ, వికారాబాద్

పార్కు స్థలాలను సంరక్షిస్తాం


పార్కును ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ మర్రి దీపిక నర్సింహారెడ్డి

మేడ్చల్ టౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని పార్కు స్థలాలను సంరక్షించి వాటిని అభివృద్ధి పరుస్తామని మేడ్చల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మర్రి దీపిక నర్సింహారెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని 12వ వార్డులో మంగళవారం నూతనంగా నిర్మించిన పార్కు, ఓపెన్ జిమ్‌ను ప్రారంభించి సీసీ పనులకు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బత్తుల ప్రియాంక మధుకర్, మాజీ జడ్పీటీసీ శైలజ హరినాథ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు బత్తుల మధుకర్, సుదర్శన్‌రెడ్డి, డీఈఈ విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

నారాయణపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే


సర్వేలో భాగంగా ఫొటో తీస్తున్న ఎంపీడీవో

తాండూరు రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయణపూర్‌లో మంగళవారం ఇందిరమ్మ ఇళ్ల సర్వే నిర్వహించారు. ఇందులో భాగంగా ఎంపీడీవో గ్రామంలోని ఇళ్లను పరిశీలించి పలువురు లబ్ధిదారుల ఫొటోలను స్వయంగా తీశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామంలో 323 కుటుంబాలకుగాను 280 కుటుంబాల్లో సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం ఎంపీడీవో గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను ఎంపీడీవో సందర్శించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు.

విద్యావ్యవస్థలో మార్పులకు ప్రతిపాదనలు


అశోక్ అగర్వాల్‌తో తెలంగాణ సభ్యులు

తాండూరు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): విద్యావిధానంలో మార్పులకు పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడానికి ఆల్ ఇండియా పేరెంట్స్ అసోసియేషన్ 3వ మహాసభల్లో చర్చించి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలంగాణ ఆల్ ఇండియా పేరెంట్స్ అసోసియేషన్ సభ్యులు ఎన్.జనార్దన్ ఓ ప్రకటనలో తెలిపారు. రెండురోజుల పాటు ఒరిస్సాలోని పూరిలో నేషనల్ కాన్ఫరెన్స్ నిర్వహించినట్లు తెలిపారు. ఆర్‌టీఈ చట్టం ఆధారంగా నాలుగు ప్రధాన అంశాలపై చర్చించి డిక్లరేషన్‌ను రూపొందించినట్లు తెలిపారు. ఈ డిక్లరేషన్‌ను కేంద్ర ప్రభుత్వానికి త్వరలోనే అందజేస్తామని వెల్లడించారు. జాతీయస్థాయిలో ఏఐపీఎను బలపర్చడం, ప్రజాప్రతినిధుల వరకు చేర్చడం, దేశ వ్యాప్తంగా నెట్‌వర్క్‌లను విస్తరించడం, విద్యాహక్కు చట్టం విస్తరణపై చర్చించినట్లు ఆయన వివరించారు.

నర్సరీలను కాపాడాలి


మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్

బొంరాస్‌పేట్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీలో చేపడుతున్న నర్సరీలను కాపాడాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్ తెలిపారు.ఆయన బొంరాస్‌పేట్ మండలంలో మంగళవారం పర్యటించి ఉపాధిహామీ నర్సరీలను పరిశీలించారు. అనంతరం సెర్ప్, ఉపాధి సిబ్బందితో మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఉపాధిహామీ కూలీలకు పని చూపించే బాధ్యత సిబ్బంది తీసుకోవాలని సూచించారు. వందరోజుల కూలీ పనిదినాలు కల్పించేందుకు కృషి చేయాలన్నారు. నర్సరీల్లో ప్రతీ మొక్కను సంరక్షించుకుంటూ మొక్కల బాధ్యత కూలీలు సక్రమంగా నిర్వహించే విధంగా పర్యవేక్షించాలన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వెంకన్‌గౌడ్ పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లపై చర్యలు చేపట్టాలి



మాట్లాడుతున్న చైర్మన్ కొండల్‌రెడ్డి

ఘట్‌కేసర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పన్నుల వసూళ్లపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం జరిగిన రెవెన్యూ విభాగం సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపాలిటీ పరిధిలోని యంనంపేట్‌లో గల శ్రీనిధి ఇంజనీరింగ్ కళాశాల, రాక్‌ఉడ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లకు చెందిన పన్నులను రీఅసెస్‌మెంట్ చేయాలని ఆదేశించారు. మున్సిపాలిటీ పరిధిలోని ఆయా వార్డుల్లో, విలీన గ్రామాల్లోనూ అన్ని ఇళ్లకు ఇంటి నెంబర్లు కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వీరారెడ్డి, రెవెన్యూ విభాగం అధికారులు కిరణ్, సాయిరాజ్ పాల్గొన్నారు.

మహిళా ఓటర్లే అధికం

బషీరాబాద్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): పంచాయతీల ఎన్నికల షెడ్యూల్ రాకముందే అధికారులు ఏర్పాట్లను ముమ్మరం చేస్తున్నారు. బషీరాబాద్ తహసీల్దార్ వై.వెంకటేష్ మంగళవారం ఓటర్ల వివరాలను వెల్లడించారు. మండల వ్యాప్తంగా మొత్తం 40,494 ఓటర్లు ఉండగా, పురుషులు 19,265 మంది, మహిళలు 21,229 మంది ఓటర్లు ఉన్నారు. కాగా ఇందులో 1964 మంది మహిళ ఓటర్లు అధికంగా ఉన్నట్లు ఆయన తెలిపారు.

తహసీల్దార్‌ను సస్పెండ్ చేయాలి

దుద్యాల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పరిగి తహసీల్దార్ ఆనంద్‌రావును వెంటనే సస్పెండ్ చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు బుస్స చంద్రయ్య డిమాండ్ చేశారు. దుద్యాల మండల తహసీల్దార్‌గా ఆనంద్‌రావు పనిచేసినప్పుడు గౌరారం గ్రామానికి చెందిన సర్వే నెం.57/2లో గల 1.13 ఎకరాల భూమి అశోక్ తండ్రి వారసత్వంతో వచ్చిన భూమి అన్నారు. తండ్రి మరణానంతరం కుమారుడు బోయిని అశోక్‌కు విరాసత్ చేయాల్సిన భూమిని వేరే వ్యక్తుల నుంచి లక్షల రూపాయలు తీసుకొని అవినీతికి పాల్పడి సంబంధంలేని వ్యక్తులకు పట్టా చేసి అన్యాయం చేశారని ఆరోపించారు. మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో రికార్డు అసిస్టెంట్ లాలయ్యకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒకరికి చెందాల్సిన భూమిని వేరొకరిపై చేయడం చట్టవిరుద్ధం అన్నారు. కార్యక్రమంలో బాధితుడు అశోక్, వెంకటయ్య, మైసప్ప, మొగులప్ప, ఆశన్న ఉన్నారు.

స్తంభం కిందపడి విద్యుత్ అంతరాయం


పొలం గట్టుపై పడిన విద్యుత్ స్తంభం

ధారూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): గట్టేపల్లి వద్ద వ్యవసాయ పొలం గట్టుపై ఉన్న తాండూరు 33కేవీ విద్యుత్ లైన్ స్తంభం కిందపడిపోయింది. దీంతో ధారూరు సబ్‌స్టేషన్ పరిధిలోని ఉదయం 9 గంటల నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పొలంలో పనులు చేస్తున్న సమయంలో ట్రాక్టర్ సపోర్టు స్తంభానికి తగలడంతో స్తంభం కూలినట్లు తెలిసింది. దీంతో విద్యుత్ సిబ్బంది ప్రత్యామ్నాయ విద్యుత్ లైన్ ద్వారా సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

బస్టాండ్‌లో చైన్‌స్నాచింగ్

పరిగి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పరిగి ఆర్టీసీ బస్టాండ్‌లో మంగళవారం రాత్రి చైన్ స్నాచింగ్ జరిగింది. ధారూర్ మండలం కేరెళ్లి గ్రామానికి చెందిన శివలీల బంధువుల దగ్గరకు వచ్చి మంగళవారం రాత్రి పరిగి బస్టాండ్‌లో హైదరాబాద్ బస్సు ఎక్కుతుండగా గుర్తుతెలియని దుండగులు ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసును అపహరించుకెళ్లారు. పోలీసులకు సమాచారం ఇవ్వగా బస్సులో తనిఖీలు నిర్వ హించారు. అయినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. బంగారు చైన్‌తులం ఉంటుందని బాధితురాలు తెలిపింది. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సంతోష్ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో పలువురికి జైలు

మోమిన్‌పేట్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో మంగళవారం డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తుండగా ఎన్కతల గ్రామానికి చెందిన ఊరడి రమేశ్, బోయ శ్రీశైలం మద్యం సేవించి బైక్‌పై వెళ్తుండగా తనిఖీలు నిర్వహించారు. వీరికి ఒక రోజు జైలు శిక్ష విధించినట్లు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేసి జైలుకు పంపించనున్నట్లు తెలిపారు.

కోట్‌పల్లి: స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన ఐదుగురిపై కేసులు నమోదు చేసి మంగళవారం కోర్టులో హాజరుపరిచారు. ఈ మేరకు కోర్టు నలుగురికి రూ.1,000 చొప్పున జరిమానాతో పాటు ఒకరికి ఒక రోజు జైలుశిక్ష విధించినట్లు కోట్‌పల్లి ఎస్ఐ గఫర్ తెలిపారు.

సంక్షిప్తంగా..

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

కీసర రూరల్: మున్సిపల్ పరిధి 16వ వార్డులో మున్సిపల్ నిధులు రూ.6లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మల్లేష్‌యాదవ్, కౌన్సిలర్ బదనపురం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులను వేధిస్తే కఠిన చర్యలు

నవాబుపేట: తల్లిదండ్రులను వేధిస్తే కఠినచర్యలు తప్పవని ఎస్ఐ అరుణ్‌కుమార్‌గౌడ్ అన్నారు. మండలంలోని పులుమామిడిలో మంగళవారం మూఢనమ్మకాలపై కళాజాత బృందంతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీసు కళాజాత బృందం సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

శామీర్‌పేట: మండల కేంద్రంలోని శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం జిల్లాకు చెందిన లక్ష్మమ్మ కుటుంబసభ్యులు, తూంకుంటకు చెందిన నరసింహ కుటుంబ సభ్యులు, ఆలయ తరఫున గౌడ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

బొంరాస్‌పేట్: నాందర్‌పూర్ గ్రామానికి చెందిన వడ్ల రాజుకు మంజూరైన సీఎం సహాయనిధి చెక్కును కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహులుగౌడ్ మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్రాములుగౌడ్, సీనియర్ నాయకులు రాంచంద్రారెడ్డి, కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లికార్జున్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మల్లేశ్, నాయకులు కిష్టప్ప, మహేందర్‌సింగ్ పాల్గొన్నారు

ఎన్నికల హామీలను అమలు చేయాలి

దోమ: సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన కామారెడ్డి డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని ఓబీసీ మోర్చా అధ్యక్షుడు మేకల గోవర్ధన్ ఆధ్వర్యంలో దోమ తహసీల్దార్ పురుషోత్తంకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం ఓబీసీలకు రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమానికి పథకాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అనంతయ్య, జిల్లా కార్యదర్శి మేకల యాదయ్య, పరిగి అసెంబ్లీ కన్వీనర్ తుప్ప విజయ్‌కుమార్, మహేశ్, మల్లేశ్, అశోక్ పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

రూ.70లక్షలతో అభివృద్ధి పనులు


శంకుస్థాపన చేస్తున్న చైర్‌పర్సన్ మంజుల రమేష్

వికారాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : 14వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.70 లక్షలతో గంగారం సమీపంలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు మునిసిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేష్ తెలిపారు. గంగారం వద్ద మంగళవారం మిషనరీ షెడ్, కంపోస్ట్ స్క్రీనింగ్ రిఫైన్మెంట్ స్టోరేజీ సెడ్ నిర్మాణ పనులకు శంకస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ జాకీర్ అహ్మద్, మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ అర్థ సుధాకర్‌రెడ్డి, చిగుళ్లపల్లి రమేష్ కుమార్, సురేష్, చందర్ నాయక్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి రైతు బాంధవుడు


సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పరశురాంరెడ్డి

పరిగి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి రైతు బాంధవుడని పరిగి ఏఎంసీ చైర్మన్ బి.పరుశరాం రెడ్డి అన్నారు. రైతు భరోసా డబ్బులు ఈ నెల 26 నుంచి జమ చేస్తున్నట్లు ప్రకటించిన సందర్భంగా మంగళవారం పరిగి మార్కెట్ కమిటీ కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ప్రధానకార్యదర్శి కె.హన్మంత్‌ముదిరాజ్, యాదవరెడ్డి, అయూబ్‌హుస్సేన్, ఎస్.రామకృష్ణ, ఇ.కృష్ణ, అక్బర్, పి.చిన్ననర్సింహులు, రత్నయ్య తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ, కొర్రెముల, సుప్రభాత్ కాలనీలో సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం క్యాలెండర్‌ను పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అ సంఘం అధ్యక్షుడు రాజయ్య, ఉప ప్రధానకార్యదర్శి అళవందార్ వేణుమాధవ్, ఉపాధ్యక్షుడు బీరయ్య, ఆంజనేయులు, నర్సయ్య, రాజు, సత్యానారాయణ పాల్గొన్నారు.

తపస్ క్యాలెండర్ ఆవిష్కరణ

మోమిన్‌పేట్: మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో ఉపాధ్యాయ సంఘం తపస్ క్యాలెండర్‌ను ఎంఈవో మల్లేశం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తపస్ సంఘం నాయకులను ఎంఈవో అభినందించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు వెంకటేశం, రవికుమార్, మహేందర్, నాగరాజు, ప్రభాకర్ పాల్గొన్నారు.

దాడి కారకులను అరెస్టు చేయాలి

ధారూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై దాడి కారకులను వెంటనే అరెస్టు చేయాలని బీజేపీ జిల్లా అధికారి ప్రతినిధి రాజేందర్‌గౌడ్, మండలాధ్యక్షుడు ఎం.రమేశ్‌లు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తమ పార్టీ కార్యాలయంపై అల్లరిమూకలు రాళ్లు, కోడిగుడ్లు వేయడం అప్రజాస్వామికమన్నారు. ఇది కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల పనేనని, ఈదాడిపై పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

క్రీడల్లో యువతకు ప్రోత్సాహం


కులకచర్ల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో యువతకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని కులకచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు అన్నారు. కులకచర్ల మండలంలోని కుసుమ సముద్రం గ్రామ యువజన సంఘం సభ్యులు మంగళవారం ఆయనను కలిశారు. గ్రామంలో ఈనెల 9 నుంచి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మహిళలపై చిన్నచూపు సరికాదు


మాట్లాడుతున్న బీఎస్.ఆంజనేయులు, మొగులయ్య

కులకచర్ల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): బీజేపీ నాయకులు మహిళలను చిన్నచూపు చూడటం సరికాదని మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు, సొసైటీ చైర్మన్ కనకం మొగులయ్య మండిపడ్డారు. కులకచర్లలో మంగళవారం వారు కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఢిల్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏఐసీసీ అగ్రనేత, ఎంపీ ప్రియాంక గాంధీపై బీజేపీ నాయకుడు రమేశ్ బిధూరి చేసిన వ్యాఖ్యలను ఖండించారు. ఆ పార్టీ అధిష్టానం స్పందించి రమేశ్ టికెట్‌ను రద్దు చేయడంతో పాటు యావత్ మహిళా లోకానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి అమిత్‌షా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్‌ను విమర్శించడం ఎంత వరకు సమంజసమన్నారు. వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు నక్క నర్సింహులు, బాబు, రఘు తదితరులు పాల్గొన్నారు.

ఇంగ్లీష్ నైపుణ్య శిక్షణకు ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్

కొడంగల్ రూరల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఉస్మానియా యూనివర్సిటీ వారు నిర్వహించే ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచింగ్ సెంటర్‌లో నిర్వహించే శిక్షణకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ బి.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఆయన మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గిరిజన విద్యార్థులకు ఈ అవకాశాన్ని కల్పిస్తూ ఒక నెలపాటు ఇస్తున్న శిక్షణకు కళాశాల విద్యార్థులు ఎం.ప్రవీణ్ , ఎం.బహదూర్‌లు ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఎంపిక చేయబడిన 30 మంది విద్యార్థులల్లో కొడంగల్ కళాశాల విద్యార్థులు ఉండడం హర్షనీయం అన్నారు. ఈ సందర్భంగా వైస్‌ప్రిన్సిపాల్ రఫియాఖానం ఉన్నారు.

క్రైం కార్నర్

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


గోపాల్ (ఫైల్)

వికారాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓవ్యక్తి మృతిచెందిన ఘటన వికారాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని సిద్దులూరు చెందిన ఎన్కెపల్లి గోపాల్(52)కు భార్య సువర్ణ, ఇద్దరు కుమారులు ఉన్నారు. గోపాల్ ఇంట్లో సోమవారం రాత్రి గాయాలతో అనుమానాస్పదంగా మృతి చెందాడని, మృతుడి రెండో కుమారుడు శ్రావణ్‌కుమార్ హత్యచేసి ఉంటాడని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేశారు. వ్యవసాయానికి కాడెద్దులు కొనుగోలు చేసి ఇవ్వాలని పలు సందర్భాల్లో తండ్రితో గొడవ పడేవాడని పుట్టుకతో మూగ, మతిస్థిమితంలేని శ్రావణ్‌కుమార్ గ్రామ దేవతకు ఈ నెల 5న నిర్వహించిన సంబురాల సందర్భంగా మద్యం మత్తులో తండ్రిపై కర్రతో దాడి చేసి గాయపర్చాడని తెలిపారు. ఆ గాయాల కారణంగానే మృతిచెందారని గ్రామస్తులు పేర్కొంటున్నారు. గోపాల్ మృతికి గోపాల్ కుమారుడు శ్రావణ్‌కుమార్, భార్య సువర్ణలే కారణమని మృతుడి అన్న పరమేశ్వర్ పోలీసులకు ఫిర్యాదు చేశారన్నాడు. ఈమేరకు అనుమానస్పద మృతిగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం రిపోర్ట్ ఆధారంగా విచారణ చేపట్టనున్నట్లు సీఐ భీమ్ కుమార్ తెలిపారు.

మద్యానికి బానిసై బాలుడి ఆత్మహత్య

యాలాల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన బాలుడు చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సోమవారం రాత్రి యాలాల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. యాలాల ఎస్ఐ గిరి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని దౌలాపూర్ గ్రామానికి చెందిన వడ్డె వెంకటయ్య, సత్యమ్మలకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భీములు(17) 9వ తరగతి వరకు చదివి మానేశాడు. అనంతరం గ్రామంలో మద్యానికి అలవాటుపడ్డాడు. ఈ విషయమై తల్లిదండ్రులు మద్యం మానేయాలని కొడుకును ఎన్నిసార్లు సూచించినా వినిపించుకోలేదు. ఈ క్రమంలో సోమవారం రాత్రి కూడా భీములు మద్యం తాగి ఇంటికి వచ్చాడు. గమనించిన భీములు తండ్రి వెంకటయ్య, తల్లి సత్యమ్మలు ఎందుకు తాగి వచ్చావని మందలించారు. దీంతో భీములు ఇంట్లో నుంచి బయటికి వెళ్లిపోయాడు. మంగళవారం ఉదయం గ్రామ సమీపంలోని భీమ్యానాయక్ పొలంలో గల వేపచెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబీకులు తెలిపినట్లు ఎస్ఐ వెల్లడించారు. మృతుడి తండ్రి వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి


నర్సింహులు(ఫైల్)

ధారూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి ఓవ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని కేరెల్లిలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ వేణుగోపాల్ గౌడ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కేరెల్లి గ్రామానికి చెందిన కావలి నర్సింహులు(48) ఈనెల 5వ తేదీన ఉదయం 11గంటలకు ఇంటి నుంచి వ్యవసాయ పొలానికి వెళ్లాడు. సాయంత్రం ఇంటికి రాకపోవటంతో ఆందోళనకు గురైన కుంటుంబసభ్యులు ఆయన ఆచూకీ కోసం చుట్టుపక్కల, తెలిసిన వారి వద్ద, బందువుల వద్ద ఆరా తీయగా జాడ తెలియరాలేదు. మంగళవారం ఉదయం వ్యవసాయం పొలం వైపు వెతుకుతుండగా దారిలో వ్యవసాయ బావి వద్ద నర్సింహులు చెప్పు కనిపించటంతో ఈతగాళ్ల సాయంతో బావిలో వెతకగా మృతదేహం బయటపడింది. కాగా నర్సింహులు మద్యం మత్తులో ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడినట్లు భావిస్తున్నారు. కుమారుడు కావలి నవీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నీటి సంపులో పడి బాలుడు..

మూడుచింతలపల్లి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి బాలుడు మృతి చెందిన ఘటన జీనోమ్ వ్యాలీ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బీహార్‌కు చెందిన మహన్ మండల్ తన భార్య నలుగురు పిల్లలతో బతుకుదెరువు నిమిత్తం శామీర్‌పేట్ మండలంలోని లాల్‌గడిమలక్‌పేట్ గ్రామానికి వలస వచ్చి కూలీపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రోజూవారిలాగే కూలీపని చేసుకుని మధ్యాహ్నం భోజనం చేయడానికి ఇంటికి వచ్చారు. చేతులు కడుక్కోవడానికి సంపు మూత తీశారు. అదే సమయంలో వారి కుమారుడు ఆర్యన్(2) ఆడుకుంటూ ప్రమాదవశాత్తు నీటి సంపులో పడిపోయాడు. భోజనం చేశాక ఆర్యన్ బయట కనిపించలేదు. అప్పటికే బాలుడు సంపులో పడిపోవడాన్ని గమనించిన వారు హుటాహుటిన మెడిసిటీ ఆస్పత్రికి తరలించారు. అయితే బాలుడు అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఐదుగురు ఆర్ఎంపీలపై కేసు

ధారూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కౌన్సిల్ నిబంధనలకు విరుద్ధంగా ఆస్పత్రులు నిర్వహిస్తూ రోగులకు వైద్యం చేస్తున్న ఐదుగురు ఆర్ఎంపీలపై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వేణుగోపాల్‌గౌడ్ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. తెలంగాణ మెడికల్ కౌన్సిల్ విజిలెన్స్ బృందం గతేడాది అక్టోబరు 26వ తేదీన ధారూరులోని ప్రైవేట్ క్లినిక్‌లను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో ఎంబీబీఎస్‌ల మాదిరిగా రోగులకు వైద్యం చేస్తున్న ఆర్ఎంపీలు మీర్‌ఇసాక్అలీ, పత్తి అనిల్ కుమార్, అశోక్‌కుమార్, మహ్మద్ ఆజాం, సునీల్‌లపై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ విజిలెన్స్ ఆఫీసర్ రాము పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ జరిపి సదరు ఆర్ఎంపీలపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

చౌడాపూర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఆటో, బైక్ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన చౌడాపూర్‌లో జరిగింది. చౌడాపూర్ నుంచి నవాబుపేటకు ప్రయాణికులతో వెళ్తున్న ఆటో మక్త వెంకటాపూర్ సమీపంలో మంగళవారం ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న దస్తగిరి అనే వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా అంబులెన్స్‌లో మహబూబ్‌నగర్‌కు తరలించారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

కోట్‌పల్లి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను ఫిర్యాదుదారుడికి అప్పగించినట్లు కోట్‌పల్లి ఎస్ఐ గఫర్ మంగళవారం తెలిపారు. బార్వాద్ గ్రామానికి చెందిన ఎర్రోళ్ల అభినవ్ బార్వాద్ గ్రామంలో 2023 ఆగస్టు 25న సెల్‌ఫోన్ పోగొట్టుకుని కోట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఈసీఐఆర్ పోర్టల్ ద్వారా దర్యాప్తు చేపట్టి బాధితుడికి మంగళవారం సెల్‌ఫోన్‌ను అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

హాస్టల్ నుంచి విద్యార్థి పరారీ.. ఆచూకీ లభ్యం

కొడంగల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పరీక్షలకు సన్నద్ధం కావాలని ఉపాధ్యాయులు మందలించడంతో హాస్టల్ నుంచి విద్యార్థి పారిపోగా సాయంత్రం వరకు ఆచూకీ లభ్యమైంది. వివరాల్లోకి వెళ్తే.. కొడంగల్ పట్టణ శివారులోని బండెల ఎల్లమ్మ దగ్గర గల మహాత్మాజ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో పదోతరగతి చదువుతున్న విద్యార్థి శివానంద్‌ను పరీక్షలకు సన్నద్ధం కావాలని ఉపాధ్యాయులు మందలించారు. దీంతో మంగళవారం ఉదయం హాస్టల్ నుంచి పరారయ్యాడు. విద్యార్థి కనిపించకపోవడంతో తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో విద్యార్థి పరిగి ప్రాంతంలో కనిపించడంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వగా విద్యార్థిని పాఠశాలకు తీసుకొచ్చి అప్పగించినట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు.